సాక్షి
వికారాబాద్
సోమవారం । 18 । ఆగస్టు । 2025



మూగజీవాలు భద్రం

వానాకాలంలో మనుషులకే కాదు.. మూగజీవాలకు వ్యాధుల ముప్పు తప్పదు. అవి అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. 8లో▸



పర్యాటకుల కోలాహలం

కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. వరుస సెలవులు కావడంతో వేల సంఖ్యలో తరలివచ్చారు. 8లో▸



వర్షంలో తడవాల్సిందేనా?

ప్రయాణికులకు షెల్టర్లు కరువయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని బస్‌స్టాపుల్లో ఎక్కడా షెల్టర్లు లేవు. 9లో▸

న్యూస్‌రీల్

మరమ్మతు చేపట్టరు సరఫరా పునరుద్ధరించరు

వృథాగా భగీరథ నీరు



రోడ్డు మధ్యలో వృథాగా పోతున్న నీరు

దుద్యాల్: మిషన్ భగీరథ నీరు వృథా అవుతోంది. మండల కేంద్రంలో రోడ్డు మధ్యలో పైపులైన్ పగిలి నీరు రోడ్డుపాలు అవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనాల రకపోకల వలన పైపులైన్ ధ్వంసం అయింది. దీని కారణంగా దుద్యాలకు రావాల్సిన నీరు సరిపడా రావడం లేదని ఆ గ్రామస్తులు పేర్కొంటున్నారు. కానీ గ్రామంలోని పలు వీధులకు గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారని తెలిపారు. పైపులైన్‌కు మరమ్మతు చేసి, సరఫరాను పునరుద్ధరించాలని భగీరథ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్

పరిగి: స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధి బసిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద శాతం రిక్రూట్‌మెంట్ చేయాల్సిన పోస్టులను.. 2024 డీఎస్సీలో 30శాతం చేసి, మిగతా 70శాతం పదోన్నతులు కల్పించడం సరికాదని పేర్కొన్నారు. కేంద్రం 2016లో తెచ్చిన వికలాంగుల హక్కుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి, వందశాతం నియామకం చేపట్టి, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.

రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

అనంతగిరి: ఈ నెల 19న బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు వికారాబాద్‌కు రానున్నారని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రమేష్ కుమార్, శివరాజు, వడ్లనందు తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఆయన ఇక్కడికి రానున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మన్నెగూడ రోడ్‌లో, వికారాబాద్‌లో శివారెడ్డిపేట వద్ద కమలనాథులు ఘన స్వాగతం పలికి, ర్యాలీగా వస్తారని చెప్పారు. అనంతరం ఎన్నెపల్లి చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతపద్మనాభ స్వామి దర్శనం అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారని చెప్పారు. స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేయనున్నారని వెల్లడించారు.

లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో అక్టోబర్‌లో నిర్వహించే లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన, మహాత్మాగాంధీ సుస్థిర మహా విజ్ఞాన సదస్సు పోస్టర్‌ను ఆదివారం పట్టణంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంట్లో గాంధీ భావజాలం ఉన్నట్లయితే ఆ ఇల్లు ప్రశాంతంగా ఉంటుందని అన్నారు. గాంధీ గ్లోబల్ సాహితీ అధ్యక్షుడు గోపాల్‌జీ, విగ్రహాల ప్రదర్శన కమిటీ కో కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి


షాబాద్: ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని ఆచార్య సోమశేఖర్, ఆచార్య గణపతి, ఆచార్య కేతన్ మహాజన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బోనగిరిపల్లి వద్ద ఉన్న మహర్షివేద గురుకులంలో ఆదివారం ఉపనయన సంస్కారం కార్యక్రమం నిర్వహించారు. యజ్ఞ హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కొంత సమయం దేవుడికి కేటాయించాలని సూచించారు. దేవాలయాలవద్దకు వెళ్లినప్పుడు నిష్టతో పూజలు చేయాలన్నారు.

కలెక్టరేట్‌కు కళంకం

మసకబారుతున్న ప్రతిష్ట

- పాలనాధికారి కార్యాలయ కేంద్రంగా అవినీతి జలగలు
- లంచావతారమెత్తుతున్న అధికారులు
- తరచూ ఏసీబీకి చిక్కుతున్న ఉద్యోగులు
- అయినా మారని తీరు

పాలనాధికారి కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. కీలక శాఖల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు లంచావతారం ఎత్తారు. పైసలు ఇస్తే పనిచేస్తామని చెప్పడంతో పాటు.. తోటి ఉద్యోగులు, ఇతరులతో అసభ్యకరంగా ప్రవర్తించి కలెక్టరేట్‌కు కళంకం తెస్తున్నారు.



వికారాబాద్: కీలక శాఖల్లో విధులు నిర్వహించే మెజార్టీ అధికారులు లంచావతారమెత్తడం కలకలం రేపుతోంది. జిల్లాలో తరచూ చోటు చేసుకుంటున్న ఘటనలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. లంచం తీసుకుంటూ జిల్లాకు గుండెలాంటి కలక్టరేట్‌లోనే ఓ మహిళా ఉద్యోగి ఇటీవల ఏసీబీ అధికారులకు చిక్కడం చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎస్పీ కార్యాలయంలో ఓ డీఎస్పీ, తాండూరు సబ్ కలెక్టరేట్‌లో ఓ తహసీల్దార్, మరో సీనియర్ అసిస్టెంట్ పట్టుబడగా.. తాజాగా పాలనాధికారి కార్యాలయమే అనిశా దాడులకు వేదికయింది.

వరుస ఘటనలు

ధారూరు ఎస్‌ఐ, డ్రైవర్ ఏసీబీకి చిక్కి నాలుగు నెలలు గడవక ముందే కలెక్టరేట్ ఉద్యోగి పట్టుబడటంతో జిల్లా యంత్రాంగం ఉలిక్కిపడింది. కలక్టరేట్‌లోనే వరుస ఘటనలు చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. రెండు నెలల క్రితం ఇక్కడే ట్రెజరీ శాఖకు చెందిన ఓ అధికారి, మహిళా ఉద్యోగితో అసభ్యకరంగా ప్రవర్తించాడన్న అపవాదు మరువక ముందే.. తాజాగా కో–ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే ఓ వ్యక్తి మద్యం సేవించి కలక్టరేట్ ఆవరణలోకి ప్రవేశించాడు. అక్కడ ఆడుకుంటున్న ఓ చిన్నారికి మాయమాటలు చెప్పి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఇది గమనించిన కలక్టరేట్ ఎదుట ఉన్న కాలనీ వాసులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇలా కలెక్టరేట్‌లో ఏదో ఒక ఘటన జరుగుతుండటంతో ప్రతిష్ట మసకబారుతుందనే వాదన వినిపిస్తోంది.

ముడుపులు చెల్లించి పోస్టింగులు తీసుకొని!

అవినీతి అధికారులకు నేతలు, ప్రజా ప్రతినిధుల అండదండలున్నాయనే ప్రచారం జరుగుతోంది. ముడుపులు చెల్లించి పోస్టింగులు తీసుకున్న అధికారులు.. ఆ వెంటనే వసూళ్లకు తెగబడుతున్నారు. లంచంగా ఇచ్చిన సొమ్మును ఎలా పూడ్చుకోవాలని మొహమాటం లేకుండా కొందరు అధికారులు మాట్లాడటం గమనార్హం. ఇదే విషయం ఉన్నత స్థాయిలో ఉన్న పర్యవేక్షణాధికారులకు అడ్డంకిగా మారుతోంది. తమకు నేతల అండ ఉందన్న ధైర్యంతో కొందరు అధికారులు.. పర్యవేక్షణాధికారులను కూడా లెక్కచేయటం లేదన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో నేతలే కీలక భూమిక పోషిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బాధితులు ఎందరో..

నాలుగు నెలల క్రితం ఎస్‌ఐతో పాటు అతని డ్రైవర్, ఐదు నెలల క్రితం తాండూరులో ఇద్దరు రెవెన్యూ అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడిన విషయం తెలిసిందే. ఇలా అధికారులు డబ్బుల డిమాండ్‌ను తట్టుకోలేక బాధితులు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయిస్తూనే ఉన్నారు. గతంలో తాండూరులో ఓ సబ్ రిజిస్ట్రార్, పరిగిలో ఎంపీడీఓ, ఈజీఎస్ ఉద్యోగి, రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్, వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారి, వికారాబాద్‌లో ఇంజినీర్, వికారాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో ఓ ఉద్యోగి లంచం తీసుకుంటూ అనిశా వలకు చిక్కడం చూస్తూనే ఉన్నాం. తాజాగా పట్టుబడిన వారు పోలీసు, రెవెన్యూ శాఖలకు సంబంధించిన వారు కాగా.. మిగతా డిపార్ట్ మెంట్లలోనూ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీలేదన్నట్లు తెలుస్తోంది. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, మైనింగ్, సబ్ రిజిస్ట్రార్, ఎస్టీఓ, డీటీఓ, ఆర్టీఏ, పోలీస్ శాఖ ఏదైనా.. లెక్క తక్కువ కాకుండా వసూళ్లకు పాల్పడుతున్నట్లు బాధితులు బాహటంగానే పేర్కొంటున్నారు. ముడుపుల విషయంలో వెలుపలకు రాని బాధితులు ఎందరు ఉన్నారో తెలియదని, ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

అధికారిపై పోక్సో కేసు నమోదు

అనంతగిరి: కలెక్టరేట్ కార్యాలయంలో కో–ఆపరేటివ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నరేందర్.. శనివారం ఓ ఎనిమిదేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. విషయం తెలుసుకున్న చిన్నారి కుటుంబీకులు అధికారికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ భీంకుమార్ తెలిపారు.

ఏసీబీ నిఘా

మరికొందరు పర్యవేక్షణ అధికారులు.. తమ కింది స్థాయి సిబ్బంది చేసే అవినీతిలో భాగస్వాములుగా మారుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇదిలా ఉండగా.. వరుస ఘటనలతో రెవెన్యూ, హెల్త్, పోలీసు, మున్సిపల్ శాఖల్లో విధులు నిర్వహించే పలువురు అధికారులపై అనిశా నిఘా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా.. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని యంత్రాంగాన్ని ఉన్నతాధికారులు హెచ్చరించినట్లు సమాచారం. వికారాబాద్‌తో పాటు పూడూరు, నవాబుపేట, మోమిన్‌పేట తహసీల్దార్లపై కూడా అవినీతి ఆరోపణలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. పరిగిలో పనిచేసిన తహసీల్దార్‌పై కూడా ఆరోపణలు ఉన్నాయి.



వికారాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు



కొడంగల్: కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

వీధి కుక్కల వీరంగం

- పరిగి, కొడంగల్‌లో 26 మందిపై దాడి
- ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటుకు మందు నిల్

పరిగి/కొడంగల్: వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఆదివారం ఒక్క రోజే పరిగి, కొడంగల్‌లో 26 మందిపై దాడి చేసి, విచక్షణా రహితంగా గాయపర్చి ఆస్పత్రి పాలు చేశాయి. పరిగి ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటుకు మందులేక పోగా.. కొడంగల్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బాధితులను నగరానికి తరలించారు. పరిగి పట్టణ కేంద్రంలోని ఖాన్‌కాలనీ, మార్కెట్ యార్డులో ఓ శునకం 16 మందిని కరిచింది. బాధితులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సకు వెళ్లగా.. సరైన మందు లేదని పేర్కొంటూ.. తాండూరుకు రిఫర్ చేశారు. దీంతో పలువురు ప్రభుత్వ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 పడకల ఆస్పత్రిలో కుక్క కాటుకు మందు లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్నాయని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గడిచిన నెలలో పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో 158 కేసులు నమోదు అయ్యాయని అక్కడి సిబ్బంది పేర్కొన్నారు. పురపాలిక అధికారులు స్పందించి వీధి కుక్కలను నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం

ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటుకు మందు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ ఆరోపించారు. కుక్కకాటు బాధితులు చికిత్సకోసం ఆస్పత్రికి వెళ్లగా.. మందు లేదని పంపించడం శోచనీయమన్నారు. దీంతో బాధితులకు వికారాబాద్‌లో చికిత్స చేయించామని పేర్కొన్నారు.

కొడంగల్‌లో పదిమందిపై..

పట్టణంలోని పలు ప్రాంతాల్లో పది మందిపై ఆదివారం తెల్లవారుజామున వీధి కుక్కలు దాడికి పాల్పడ్డాయి. విధుల్లో ఉన్న మున్సిపల్ కార్మికుడు జోగు అనంతయ్యతో పాటు మరికొందరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కార్గిల్ కాలనీలో నివాసం ఉంటున్న కురుమయ్య, పట్టణంలో ఓ చిన్నారిపై దాడి చేశాయి. బాధితులకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిల్లో ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద అధికమైందని, వాటి నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు.

మందులు అందుబాటులో ఉంచాలి

సర్కారు దవాఖానాల్లో కుక్కకాటు చికిత్సకు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ఆదేశించారు. పరిగి ఏరియా ఆస్పత్రిలో కుక్కకాటుకు మందు లేదన్న విషయం తెలుసుకున్న ఆయన.. ఆస్పత్రికి వచ్చారు. బాధితులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. కుక్కకాటు చికిత్సకు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా వైద్యాధికారులతో మాట్లాడి.. సోమవారం నుంచి మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు చెప్పారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు సమకూర్చుతుంటే.. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని హెచ్చరించారు.



రుద్రారం- కోట్‌పల్లి ప్రాజెక్టు మధ్య కల్వర్టు వద్ద దెబ్బతిన్న రోడ్డు

ఆదమరిస్తే అంతే..

- రోడ్డు మధ్యలో గోతులు
- ప్రమాదపుటంచుల్లో పర్యాటకుల ప్రయాణం
- నిధులు లేక నీరసించిన పనులు

ధారూరు: నిత్యం వేలాదిమంది పర్యాటకులు కోట్‌పల్లి జలాశయానికి రాకపోకలు సాగించే మార్గం అధ్వానంగా తయారయింది. ప్రస్తుత వర్షాలతో పలు చోట్ల భారీగా గోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ధారూరు మండలం రుద్రారం గ్రామం దాటిన తరువాత రెండో కల్వర్టు వద్ద గోతులు ఏర్పడ్డాయి. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. వాహనాలు దెబ్బ తింటున్నాయి. ఇలా మరమ్మతుకు గురైన వాహనాలను ఘటనా స్థలం రోడ్డు పక్కనే వదిలి వెళ్తుండడంతో మరిన్ని ప్రమాదాలకు దారి తీస్తుందని, ఏదైనా భారీ నష్టం జరగముందే తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. అయినప్పటికీ.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికి కారణం నిధుల లేమి అని తెలుస్తోంది. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి, గుంతలు, ధ్వంసం అయిన చోట మరమ్మతులు చేయించాలని వాహనదారులు, పర్యాటకులు కోరారు.

సర్దార్ పాపన్నగౌడ్ సేవలు మరువలేనివి

కడ్తాల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ముద్విన్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం సర్దార్ పాపన్నగౌడ్ చేసిన సేవలు మరువలేనివని, తెలంగాణ వీరత్వానికి ప్రతీక అంటూ కొనియాడారు. ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని, అన్ని కులవృత్తులను ప్రోత్సహిస్తోందని గుర్తుచేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు సర్వాయిపాపన్న గౌడ్ అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు స్థలంతో పాటు రూ.3 కోట్లు మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రోడ్డుపాలు

జాతీయ రహదారి పనుల్లో ఇళ్లు కోల్పోతున్న 30 మంది

- కోటబాసుపల్లి, ఐనెల్లి, కోత్లాపూర్‌లో బాధితులు
- పట్టా ఉన్న భూములు, ఇళ్లు, దుకాణాలకే పరిహారం
- ఆదుకోవాలని పలువురి విన్నపం
- జిల్లాలో రూ.613 కోట్ల వ్యయంతో 42 కిలో మీటర్ల మేర పనులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గుర్రంపల్లి రాందాస్. తాండూరు మండలం కోటబాసుపల్లి గ్రామం. రాందాస్ రెండేళ్ల క్రితం రూ.63 లక్షలతో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ప్రస్తుతం ఇతని ఇంటి ముందు నుంచి తాండూరు – చించోళి నేషనల్ హైవేని వేస్తున్నారు. పాత రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల మేర ఇళ్లను కూల్చివేస్తున్నారు. ఇందులో రాందాస్‌కు చెందిన రెండు దుకాణాలు పోతున్నాయి. దాదాపు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లితుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రాందాస్ ఒక్కడే కాదు చాలా మంది ఇళ్లు, దుకాణాలు కోల్పోయి రోడ్డు పాలవుతున్నారు. కోటబాసుపల్లి మాజీ సర్పంచ్ కుర్వ నాగార్జున ఇల్లు 80 శాతం కూల్చివేతకు గురవుతోంది.

తాండూరు రూరల్: మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక రాష్ట్రం మన్నెకెల్లి వరకు కేంద్ర ప్రభుత్వం 167 నేషనల్ హైవేగా ప్రకటించింది. మన జిల్లాలో 42 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. కొండగల్ నియోజకవర్గంలోని దుద్యాల్ నుంచి తాండూరు మండలం కొత్లాపూర్ వరకు పనులు జరుగుతున్నాయి. తాండూరు మండలం కోటబాసుపల్లి, ఐనెల్లి, కోత్లాపూర్ గ్రామాల్లో ఇళ్ల కూల్చివేత పనులను ప్రారంభించారు. దీంతో బాధితుల్లో ఆందోళన నెలకొంది.



జాతీయ రహదారి పనుల్లో భాగంగా కోటబాసుపల్లిలో కూల్చివేసిన ఇళ్లు

50 ఫీట్ల మేర కూల్చివేతలు

నేషనల్ హైవే పనుల్లో భాగంగా పాత రోడ్డుకు ఇరువైపులా పొలాల వద్ద 75 అడుగులు, గ్రామాల్లో ఇళ్లు ఉన్న చోట 50 ఫీట్ల మేర కూల్చివేత ప్రక్రియ చేపట్టారు. కోటబాసుపల్లిలో మేజర్‌గా, ఐనెల్లి, కొత్లాపూర్ గ్రామంలో పాక్షికంగా ఇళ్లు పోనున్నాయి. అయితే ప్రభుత్వం పరిహారం ఇవ్వడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు కూల్చివేస్తే తాము ఎక్కడ ఉండాలని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

గూడు చెదిరె..

రోడ్డు విస్తరణ పనుల కారణంగా పలువురు వీధిన పడుతున్నారు. కోటబాసుపల్లిలో మాజీ సర్పంచ్ నాగార్జున ఇల్లు పూర్తిగా పోతుంది. దీంతో ఆయన అద్దె గదిలో ఉంటున్నాడు. రాందాస్, మొగులప్ప, కుర్వ రవి, కృష్ణవేణి, వడ్డె హన్మంత్, వడ్డె వెంకటయ్య ఇల్లు దెబ్బతింటున్నాయి. చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్, శేఖర్, యూసుఫ్, రామయ్యగౌడ్, భీమప్ప ఇళ్లు, ప్రహరీలు కొంత మేర తొలగించాల్సి వస్తోంది. అయితే రోడ్డుకు 50 అడుగల దూరం వరకు పరిహారం ఇవ్వరని అధికారులు అంటున్నట్లు బాధితులు తెలిపారు.

ఆదుకోవాలని వినతులు

నేషనల్ హైవే కారణంగా దాదాపు 30 మంది ఇళ్లు, దుకాణాలు కోల్పోతున్నారు. తమను ఆదుకోవాలని గతంలో తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. ఉన్న ఇళ్లు పోతే రోడ్డు పాలవుతామని గోడు వెళ్లబోసుకున్నారు. తమను ఆదుకోవాలని వేడుకున్నారు. బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిసింది.

అన్ని విధాలా నష్టం

జాతీయ రహదారి కారణంగా రెండు దుకాణాలు కోల్పోతున్నా. దాదాపు రూ.10 లక్షలు నష్టం జరుగుతుంది. దుకాణాల కూల్చివేతకు రూ.2 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆ ఖర్చు అయినా భరించాలి. లేకుంటే అన్ని విధాలా నష్టపోతా. – గుర్రంపల్లి రాందాస్, కోటబాసుపల్లి

పరిహారం కుదరదు

జిల్లాలోని దుద్యాల్ నుంచి కోత్లాపూర్ వరకు జాతీయ రహదారి పనులు చేట్టాం. రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల వరకు ఉన్న ఇళ్లు, ప్రహరీలు, కార్యాలయాలను తొలగిస్తున్నాం. పట్టా ఉన్నవారికే పరిహారం వస్తుంది. ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇళ్లకు మాత్రం పరిహారం రాదు.

– సురేష్, ఏఈ, నేషనల్ హైవే విభాగం

క్లుప్తంగా

విస్తారంగా వర్షాలు..
నీటమునుగుతున్న పంటలు


చింతలపల్లిలో దెబ్బతిన్న పత్తి పంటను చూపిస్తున్న రైతులు

పూడూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు నీటమునిగాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండల పరిధి రేగడిమామిడిపల్లి, బార్లపల్లి, చన్గోముల్, తిమ్మాపూర్, కంకల్, మిట్టకంకల్, చింతలపల్లి, పూడూరు, పుడుగుర్తి తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చన్గోముల్– బార్లపల్లి మధ్య వాగు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుపై బురద వచ్చి చేరింది. పుడుగుర్తి, కడుమూరు, కంకల్, మంచన్‌పల్లి, మేడిపల్లికలాన్, ఈసి వాగు పరుగులు తీస్తోంది. దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఠాణా వద్ద పట్టుబడిన ట్రాక్టర్లు

బొంరాస్‌పేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ట్రాక్టర్ల యజమానులు అంజిలయ్య, శ్రీకాంత్‌లపై కేసునమోదు చేశామని ఎస్‌ఐ బాల వెంకటరమణ తెలిపారు.

ఊరికి వెళ్తున్నానని చెప్పి.. కనిపించకుండా పోయి


సాబెర్ హుస్సేన్ (ఫైల్)

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సాబెర్ హుస్సేన్ (20) రెండు నెలల క్రితం తుక్కుగూడకు వలస వచ్చి హర్షగూడలో ఉన్న కంపెనీలో లేబర్‌గా పని చేస్తున్నాడు. తనకు ఇక్కడ పని చేయడం ఇష్టలేదని తోటి స్నేహితుడు లస్కర్‌కు చెప్పి సొంతూరు వెళ్తానంటూ ఈ నెల 6న బయల్దేరాడు. సొంతూరుకు వెళ్లకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ విషయమై స్నేహితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గానీ 87126 62367 నంబర్‌లో గానీ సమాచారం ఇవ్వాలని సూచించారు.

పెద్దమ్మ ఆలయంలో భక్తురాలి గొలుసు చోరీ

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ శ్రీపెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించేందుకు వచ్చిన ఓ మహిళా భక్తురాలి బంగారు గొలుసు చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..ఎల్బీనగర్‌కు చెందిన ఓ మహిళ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించేందుకు వచ్చారు. అదే సమయంలో మొక్కు తీర్చుకుంటుండగా ఆమె హ్యాండ్‌బ్యాగ్ చోరీకి గురైంది. అందులో ఉన్న 13 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురి కావడంతోఆమె కొడుకు నరేంద్రబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము మొక్కు తీర్చుకునేందుకు రాగా గుర్తుతెలియని వ్యక్తులు తన తల్లి హ్యాండ్‌బ్యాగ్ చోరీ చేశారని, అందులో బంగారంతో పాటు నగదు ఉందని పేర్కొన్నారు. ఇక్కడి సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ వ్యక్తి ఆమె హ్యాండ్‌బ్యాగ్‌ను చోరీ చేస్తున్నట్లుగా గుర్తించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎక్సైజ్ పోలీసులు దాడిచేశారంటూ ఫిర్యాదు

తమపై కూడా దాడిజరిగిందని ఎక్సైజ్ పోలీసులు సైతం

జీడిమెట్ల: నాంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ తన సోదరుడిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడిచేయించారని కుత్బుల్లాపూర్‌కు చెందిన పవన్ కుమార్ జీడిమెట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. అదే విదంగా నాంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ సైతం తన విధులకు అటంకం కలిగించారని ఫిర్యాదు చేశారు. జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఇరువురి పిర్యాదులు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శనివారం రాత్రి ఓ యువకుడి గంజాయి,హష్ ఆయిల్ సేవిస్తుండగా ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. రెండవ వ్యక్తిని పట్టుకునేందుకు కుత్బుల్లాపూర్‌లోని అయోధ్యనగర్‌కు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కోటమ్మ తన సిబ్బందితో వెళ్లారు. అక్కడ దర్యాప్తు చేస్తుండగా స్థానికంగా ఉన్న హేమంత్, నితీష్, రవితేజ, చరణ్ పోలీసుల విధులకు అటంకం కలిగించారంటూ ఆమె జీడిమెట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి ఎక్సైజ్ అధికారులు బాలు మహేందర్,హేమంత్ అనే ఇద్దరిని విచారణ చేస్తున్నారు. వెంకటేశ్వర నగర్‌కు చెందిన చంటియాదవ్ చూసి వారిని పట్టుకోవడానికి మీరెవరు అంటూ ప్రశ్నించాడు. దీంతో వారు దాడిచేశారని.. డాక్టర్లు 23 కుట్లు వేశారని బాధితుడి సోదరుడు పవన్‌కుమార్ జీడిమెట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరు వర్గాల ఫిర్యాదులు తీసుకున్నారు.

మూగజీవాలు భద్రం

- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త
- అప్రమత్తత తప్పనిసరి
- లేదంటే పశుసంపదకు ముప్పు
- పశువైద్యాధికారి విశ్వనాథం



నవాబుపేట: వానాకాలం సీజన్‌లో మనుషులకే కాదు.. మూగజీవాలకు వ్యాధుల ముప్పు తప్పదు. ఈ కాలంలో పశువులు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. సూక్ష్మజీవుల కారణంగా గొంతువాపు, జబ్బవాపు తదితర రోగాలు చుట్టుముడతాయి. ఈగలు, దోమల దాడి పెరుగుతుంది. ఈ సమస్యలను అధిగమించేందుకు రైతులు యాజమాన్య చర్యలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. వాటి జీవన స్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని, ఎలాంటి వ్యాధి సోకినా వెంటనే వైద్య చికిత్స అందించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ విశ్వనాథం రైతులకు సూచిస్తున్నారు. కాగా మండలంలో ఆవులు, ఎడ్లు 4,232 ఉండగా.. గేదెలు 1,162, గొర్రెలు 3,573, మేకలు 7,874 ఉన్నాయి.

గాలికుంటు

గాలికుంటు వ్యాధి సోకిన పశువు చాలా బలహీనంగా ఉంటుంది. పాడి పశువులు నీరసించి పోతుంటాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది. సాగు పనులకు ఎడ్లు సహకరించవు. సంకరజాతి పశువులతో పాటు షెడ్‌లలో పెంచుకునే వాటికి ఈ రోగం వ్యాపిస్తుంటుంది. ఎక్కువగా మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్ నెలలో సోకే ప్రమాదం ఉంది. వ్యాధి బారిన పడిన పశువులకు నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3,4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా మారుతాయి. చర్మం గరుకుగా మారుతుంది. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడి మేత తీసుకోలేక నీరసించిపోతాయి. నోటి నుంచి సొంగ కారుతుంది.

జబ్బవాపు

వయసులో ఉన్న ఆరోగ్య వంతమైన పశువులు, తెల్లజాతి పశువులకు ఈ జబ్బవాపు వ్యాధి సంక్రమిస్తుంటుంది. ఇది సోకిన పశువు అధిక జ్వరంతో బాధపడుతుంది. మేత మేయదు. నిత్యం పడుకొనే ఉంటుంది. జబ్బభాగం వాచి, నల్లగా కములుతుంది. అక్కడ కండరాలు ఉబ్బుతాయి. వాటిలో గాలి బుడగలు, నీరు చేరి తీవ్రమైన నొప్పితో విలవిలలాడుతుంటుంది. వాపు ఉన్నచోట చేతితో తాకితే గరగరమని శబ్దం వస్తుంది. సకాలంలో వైద్యం అందించకపోతే పశువు నీరసించి, చనిపోతుంది. సకాలంలో సూదిమందు, గ్లూకోజ్ ద్రావణాన్ని అందించాలి. ఈ వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకా వేయిస్తే మేలు.


పశువులకు గాలి కుంట టీకాలు వేస్తున్న వైద్యుడు(ఫైల్)

గొర్రెల్లో కాలిపుండ్లు

వర్షాకాలంలో గొర్రెలు బురదలో తిరగడం వలన కాలిపుండ్ల వ్యాధి సోకుతుంది. గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి చిట్లుతుంది. చీముపట్టి నొప్పితో ముందుకాళ్లపై గెంటుతాయి. వ్యాధి ముదిరితే గిట్ట లూడిపోతాయి. ఇది సోకిన జీవాలకు 10 శాతం మైలతుత్తం, పదిశాతం జింక్‌సల్ఫేట్, లేదంటే ఐదు శాతం ఫార్మలిన్‌లో ఏదైనా ఒక ఆయింట్‌మెంట్ పూయాలి. యాంటిబయాటిక్ ఇంజెక్షన్ వరుసగా 3–5 రోజుల పాటు వేయించాలి. గొర్రెలను బురద నేలల్లో ఎక్కువగా తిరగనియొద్దు.

గురక వ్యాధి

ప్రస్తుత కాలంలో పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు(గురక) ఒకటి. ముఖ్యంగా వయసులో ఉన్న వాటికి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. దీని బారిన పడిన వాటికి ఆకస్మాత్తుగా అధిక జ్వరం వస్తుంది. మేత మేయదు. గొంతుపై, మెడ కింద వాపు కన్పిస్తుంది. ఆయాసపడుతూ శ్వాస పీల్చుకుంటుంది. ఆ సమయంలో గురక శబ్దం వస్తుంది. నోరు, ముక్కు నుంచి ద్రవం కారుతుంది. వణుకుతూ ఉంటుంది. కళ్లు ఎర్రబడి నీరు కారుతుంది. పాడి పశువుల్లో పాలదిగుబడి తగ్గుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువ అయితే ఎడతెరపి లేకుండా దగ్గుతూ, అపస్మారక స్థితికి వెళ్లి చనిపోతుంది.

లేత గడ్డి ప్రమాదం

తొలకరి జల్లులకు మొలిచే లేత గడ్డి మొక్కలను పశువులు అతిగా తింటుంటాయి. అయితే ఆ గడ్డిలో హైడ్రో సైనైడ్ విష పదార్థం ఉంటుంది. దీనిని మేసిన 15 నిమిషాలకే పశువుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. వెంటనే తగిన చికిత్స చేయించకపోతే అది మృత్యువాత పడే ప్రమాదం ఉంది. కాబట్టి రైతులు పశువులకు లేత గడ్డిని మేతగా వేయవద్దు. తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

దోమలు దాడి చేస్తే..

నేల చిత్తడిగా ఉండి, వాతావరణం అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశంలో నీరు నిల్వ ఉన్న గుంతలు, మురుగునీటి కాల్వల్లో ఈగలు, దోమలు ఆవాసాన్ని ఏర్పర్చుకుంటాయి. ఇవి ఆహారం కోసం పశువులపై దాడి చేస్తుంటాయి. ఈ సీజన్‌లో వీటి తాకిడి ఎక్కువగా ఉంటుంది. పశువుల శరీరంపై వాలి రక్తాన్ని పీలుస్తాయి. తద్వారా పశువులు మేత సరిగా మేయవు, నిద్ర పోవు. ఫలితంగా అవి రక్తహీనతకు గురవుతాయి. ఈగలు, దోమ కాటు వలన పశువు శరీరంపై పుండ్లు ఏర్పడతాయి. అందుకు పశువుల పాకలు, నిల్వ ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్‌ను పిచికారీ చేయాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఉదయం , సాయంత్రం వేళల్లో ఎండుపిడుకలు, వేపాకుతో పొగపెడితే ఈగలు, దోమలు తగ్గుతాయి.


జాలువారుతున్న నీటిలో ఫొటోలు దిగుతున్న చిన్నారులు

పర్యాటకుల కోలాహలం

జాలువారిన జలాల కింద ఎంజాయ్

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరిగింది. వరుస సెలవులు, పైగా ఆదివారం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి వేల సంఖ్యలో తరలివచ్చారు. అనుమతి లేకున్నా.. జలాశయం అలుగుపై కేరింతలు కొట్టారు. జాలువారుతున్న నీటి కింద కుటుంబ సమేతంగా ఎంజాయ్ చేస్తూ.. తడిసిముద్దయిపోయారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. బోటింగ్ చేశారు.


అలుగు కింద పర్యాటకుల సందడి

మద్యానికి బానిసై.. ఉరివేసుకుని

డ్రైవర్ బలవన్మరణం


వెంకటేశ్ (ఫైల్)

మొయినాబాద్: మద్యానికి బానిసైన ఓ డ్రైవర్ కుటుంబ కలహాలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌కు చెందిన కావలి వెంకటేశ్ (48) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై తరచూ భార్యను వేధించేవాడు. దీంతో ఆమె ఇటీవల పుట్టింటికి వెళ్లింది. శనివారం మధ్యాహ్నం వెంకటేశ్ మద్యం మత్తులో భార్యకు ఫోన్ చేసి తాను ఉరివేసుకుని చనిపోతున్నానని చెప్పాడు. వెంటనే ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి పరిశీలించారు. మద్యం మత్తులో ఉండడంతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా ఇంటిదగ్గరే వదిలి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులోనే ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్య పెళ్లికొడుకు కోసం పోలీసుల వేట

అత్తాపూర్: ప్రేమ పేరుతో పెళ్లి చేసుకోవడం..కొద్ది రోజుల తరువాత మరో అమ్మాయితో ప్రేమ అంటూ వెంట పడుతున్న నిత్య పెళ్లి కొడుకు కోసం అత్తాపూర్ పోలీసులుగ గాలిస్తున్నారు. పెళ్లి పేరుతో మోసపోయిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవికుమార్ ఎలియాస్ రఫీపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. రవికుమార్ కొంత కాలంగా అత్తాపూర్ పరిసర ప్రాంతాలలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంగా చేస్తున్నట్లు నటించసాగాడు. తనకంటే వయస్సులో కంటే చిన్న వారిని గుర్తించి ప్రేమ పేరుతో నమ్మించి వివాహాలు చేసుకోవడం అలవాటుగా చేసుకున్నాడు. ప్రేమ పేరుతో అమ్మాయిలను లొంగదీసుకోవడంతో పాటు శారీరకంగా మానసికంగా హింసిస్తాడని పోలీసులు తెలిపారు. ప్రేమించుకునే సమయంలో మాట్లాడుతున్న సంభాషణలు వారు గడిపిన ప్రదేశాలను ఆడియో... వీడియోలను సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తానంటూ బెదిరిస్తూ ఉండటంతో బాధిత యువతులు నిస్సహాయంగా ఉండిపోతున్నారు. తప్పించుకు తిరుగుతున్న రఫీపై వివిధ కేసులు నమోదు చేశారమన్నారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏడేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన..

అల్వాల్: ఏడేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదైన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం బాలాజీ రైస్ మిల్ సమీపంలో నివసించే ఖాసీం (27) శనివారం సాయంత్రం తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న ఏడేళ్ల బాలికకు తన ఇంట్లోని ఆక్వేరియం చూపిస్తానని తీసుకెళ్లి బంధించి అసభ్యంగా ప్రవర్తించాడు. కుమార్తె కనిపించకపోవడంతో బాధిత తల్లిదండ్రులు ఖాసీం ఇంట్లో ఉందని తెలుసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నింధితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

ర్యాష్ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవు

రాజేంద్రనగర్: వాహనదారులు ప్రమాదకర విన్యాసాలు, ప్రజలకు ఆటంకం కలిగించేలా ర్యాష్‌గా డ్రైవింగ్ చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.రాజు హెచ్చరించారు. ఇటీవల మద్యం సేవించి ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించిన బాబానగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రషీద్, చంపాపేట్‌కు చెందిన జాఫర్ అహ్మద్ షా, బాలాపూర్‌కు చెందిన సయ్యద్ అఫ్రోజ్ అనే యువకులను అదుపులోకి తీసుకొని వారి నుంచి హోండా షైన్ వాహనం (ఏపీ12పీ 7745), యాక్టివా (టీఎస్10ఎఫ్‌జీ 5061) వాహనాలను స్వాధీనం చేసుకొని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించామన్నారు. ఈ 16వ తేదీన బండ్లగూడ నుంచి ఆరాంఘర్ వైపు ముగ్గురు యువకులు రెండు ద్విచక్ర వాహనాలను నడుపుతూ వాహనాలపై మద్యం సేవిస్తూ ప్రజలకు, వాహనదారులు ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఈ విషయాన్ని ఇతర వాహనదారులు వీడియోలు తీసి రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు ఆన్‌లైన్‌లో తెలపగా.. వారిని గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చి వారి పత్రాలను పరిశీలించి తదుపరి విచారణ నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించామని వివరించారు.


పోలీసుల అదుపులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు

వీధుల్లో అంధకారం


చీకట్లో పెద్దగోల్కొండలోని ఓ వీధి

శంషాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద గోల్కొండలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట బయటకు వెళ్లడానికి జంకుతున్నారు. ఎదురుగా వచ్చే వారిని గుర్తు పట్టలేనంతగా వీధులో చీకట్లు అలుముకుంటున్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాల మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ క్రిమినల్స్ టోకరా

బంజారాహిల్స్: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు సైబర్ మోసగాళ్లు షాకిచ్చారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని ఐలాం కాలనీలో నివసించే సీతారత్నం (40) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సెల్‌ఫోన్‌ను నెల క్రితం పోగొట్టుకున్నాడు. అదేరోజు బ్యాంక్ అకౌంట్‌తో పాటు సిమ్‌కార్డును హోల్డ్‌లో పెట్టారు. రెండు రోజుల క్రితం ఆమె పోగొట్టుకున్న ఫోన్ నెంబర్‌ను తిరిగి తీసుకున్నారు. ఫోన్ పే చేయాలని చూడగా ఫెయిల్యూర్ అని వచ్చింది. దీంతో ఆమె యాక్సిస్ బ్యాంక్‌కు వెళ్లి విషయం చెప్పగా నెల క్రితం అకౌంట్‌ను హోల్డ్ చేసినప్పుడు డెబిట్‌కార్డును కూడా హోల్డ్ చేశామని.. మళ్లీ తీసుకోవాలని చెప్పారు. దీంతో ఆమె డెబిట్‌కార్డు మరోసారి తీసుకుంది. యాక్టివేషన్ జరిగిన కొద్దిసేపట్లోనే ఆమె ఫోన్‌కు రూ.50 వేల చొప్పున రెండుసార్లు అకౌంట్ నుంచి డ్రా చేసినట్లుగా మెసేజ్ వచ్చింది. పోగొట్టుకున్న తన ఫోన్‌లో నుంచి సిమ్‌కార్డును తీసుకుని సైబర్ మోసగాళ్లు డబ్బులు డ్రా చేసి ఉంటారని భావిస్తూ ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెల్పర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇబ్రహీంపట్నం: హమాలీ కార్మికులకు హెల్పర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.వీరయ్య డిమాండ్ చేశారు. రైస్ మిల్లు హమాలీ కార్మికుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ఒకటవ మహాసభను స్థానిక పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా హమాలీ కార్మికులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. రైస్ మిల్లు యాజమాన్యాలు కార్మికులకు సంవత్సరానికి రూ.7 వేల బోనస్, ప్రమాద బీమా రూ.15 లక్షలు ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, రెండేళ్లకు ఒకసారి అగ్రిమెంట్ రూపంలో కూలీ రేట్లు పెంచాలని కోరారు. అనంతరం హమాలీ కార్మికుల మహాసభ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా దుర్గయ్య, కోశాధికారిగా జంగయ్య, ఉపాధ్యక్షులుగా జంగయ్య, వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా శ్రీశైలం, రామ్‌రెడ్డి, జంగయ్య, ఆర్గనైజర్‌గా బుగ్గరాములు, పండిత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాలమోని స్వప్న, మున్సిపల్ కన్వీనర్ ఎల్లేశ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరయ్య

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


రాజేందర్


రత్నం

శంషాబాద్ రూరల్: వేర్వేరు ఘటనలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... మహారాష్ట్రకు చెందిన సూర్యవంశీ రాజేంద్ర(35), పూజ దంపతులు ఉపాధి కోసం పదేళ్ల కిందట వలస వచ్చి ఇందిరానగర్ దొడ్డిలో నివాసముంటున్నారు. ఈ నెల 10న పూజ ఉదయం పనికి వేళ్ల సమయంలో రాజేంద్ర ఇంట్లోనే ఉన్నాడు. స్వగ్రామం వెళ్తానని చెప్పాడు. అదే రోజు సాయంత్రం పూజ పని నుంచి తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. ఇంటికి తాళం వేసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. భర్తకు చెందిన దుస్తులు, బ్యాగు కనిపించలేదు. అతను స్వగ్రామం వెళ్లి ఉంటాడని భావించింది. దీంతో భర్తకు ఫోన్ చేయగా.. స్విచ్ ఆఫ్ అయింది. అత్తకు ఫోన్ చేసి అడగగా అక్కడకు రాలేదని చెప్పింది. దీంతో అతని కోసం అన్ని చోట్ల వెతికినా జాడ తెలియకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

ముచ్చింతల్‌కు చెందిన బొడ్డు రత్నం(48) ఈ నెల 13న నందిగామ మండలం చేగూరులో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. అదే రోజు రాత్రి రత్నం భార్య మంజుల తన కూతురుకు ఫోన్ చేసి వాకబు చేసింది. అతను కూతురు వద్దకు వెళ్లలేదని తెలియడంతో అన్ని చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి చేసుకుంటానని మోసగించిన వైద్యుడి అరెస్టు..

ఫిలింనగర్: పెళ్లి జరిగిన విషయాన్ని దాచిపెట్టి యువతితో సహ జీవనం చేయడమే కాకుండా ఎప్పుడు పెళ్లి చేసుకుంటావని అడగడానికి వెళ్లిన యువతిపై దాడి చేసిన వైద్యుడిని ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–92లోని ఏషియన్ స్పైన్ హాస్పటల్‌లో బాచుపల్లికి చెందిన డాక్టర్ పోసినపల్లి రాజేందర్‌రెడ్డి (35) ఆర్థోపెడిక్ వైద్యుడిగా పనిచేస్తున్నారు. 2024 సెప్టెంబర్‌లో మణికొండ పంచవటి కాలనీకి చెందిన డిజైనర్ (28)తో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. ఇద్దరూ కలిసి మణికొండలోని డిజైనర్ ఇంట్లోనే సహజీవనం చేస్తున్నారు. కాగా డాక్టర్ రాజేందర్‌రెడ్డికి అంతకు రెండేళ్ల క్రితమే వివాహం కాగా, ఆ విషయాన్ని దాచిపెట్టి డిజైనర్‌తో సహజీవనం చేస్తున్నాడు. పెళ్లి ఎప్పుడు చేసుకుంటావని సదరు యువతి పనిచేస్తున్న ఆస్పత్రికి వెళ్లి రాజేందర్‌రెడ్డిని నిలదీసింది. ఈ విషయంలో ఇద్దరి మధ్యా తీవ్ర గొడవ జరగ్గా ఆమెను కొట్టడమే కాకుండా ఫోన్‌ను నేలకేసి కొట్టి ధ్వంసం చేశాడు. ఎటూ వెళ్లకుండా కొద్దిసేపు ఆమెను అడ్డగించి వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు డాక్టర్ రాజేందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసిన ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీలో బురదమయంగా మారిన రోడ్డు


సురంగల్ రోడ్డులో ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షం నీరు

అడుగుకో గుంత.. వెళ్లాలంటే చింత

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

- వాహనదారులకు తప్పని పాట్లు


అజీజ్‌నగర్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మొయినాబాద్: రహదారులు ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. అడుగడుగునా గుంతలతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మున్సిపల్ పరిధిలోని ఆర్ అండ్ బీ రోడ్లతోపాటు గ్రామాల లింకు రోడ్లు సైతం అధ్వానంగా మారాయి. వర్షాల కారణంగా హిమాయత్‌నగర్– తంగడపల్లి ఆర్ అండ్ బీ రోడ్డులో చిలుకూరు వద్ద పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులు నడుములు పట్టేస్తున్నాయని వాపోతున్నారు. చిలుకూరు–మొయినాబాద్ లింకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు చేపట్టకపోవడంతో గుంతల్లో వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. మొయినాబాద్– అమీర్‌గూడ రోడ్డులో అడుగుకో గుంత ఏర్పడింది. పెద్దమంగళారం–చందానగర్ రోడ్డుపై వెళ్లడానికే వాహనదారులు, స్థానికులు జంకుతున్నారు. సురంగల్–శ్రీరాంనగర్ రోడ్డుపై వర్షం నీరు నిలిచి గుంతలు ఏర్పడి బురదమయంగా మారింది. అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ వద్ద రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు ఇళ్ల మధ్యలోనుంచే ఉండటంతో వాహనదారులతో పాటు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.